
నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, బుధవారం 5 మార్చి 2025 VIKARABAD

## భారమవుతున్న వ్యవసాయం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు కింద పెట్టుబడి సాయం.. కోతలులేని కరెంటు.. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేవి. దీంతో రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవించేవారు. కానీ, ప్రస్తుతం వేసిన రెండు పంటలకు కూడా రైతు బంధు రాక రైతులు అప్పులుచేసి వ్యవసాయాన్ని సాగుచేస్తున్నారు. ఈ యాసంగిలో కూడా రైతు భరోసా రాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేకపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. యాచారం మండలంలోని మొండి గౌరెల్లి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో చెక్‌డ్యాం ఎప్పుడూ నీటితో కళకళలాడేది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు అనుకూలించక చెక్‌డ్యాం ఎండిపోయింది. దీంతో చెక్‌డ్యాం కింద తవ్విన బావి కూడా ఎండిపోయింది. చెక్‌డ్యాం, బావి రెండు ఎండిపోవటంతో నీటి వనరులు పూర్తిగా కనుమరుగయ్యాయి. పంట పొలాలు ఎండిపోతుండటంతో ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో రైతులు ఉన్నారు. రైతు భరోసా వస్తుందని భావించి నమ్మకంతో వరి పంటలు సాగుచేశారు. రైతు భరోసా రాకపోవటంతో అప్పులు అప్పుగానే మిగిలిపోతున్నాయి.



- రూ.2 లక్షలలోపు రుణమాఫీ పూర్తయిందంటూ ప్రభుత్వం ప్రచారం
- ఇప్పటివరకు రూ.1.50 లక్షల వరకే రుణమాఫీ పూర్తి
- జిల్లాలో రూ.2 లక్షల లోపు రుణమాఫీకి 1,01,278 మంది రైతులు అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం
- బీఆర్ఎస్ హయాంలో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేత
- ఇచ్చిన మాట ప్రకారం గడువులోగా పంట రుణాలను మాఫీ చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- సగం మంది రైతులకే అందిన రైతు భరోసా సాయం
- జిల్లావ్యాప్తంగా 3.12 లక్షల మంది రైతులకుగాను ఇప్పటివరకు 1.74 లక్షల మంది రైతులకే లబ్ధి
- మరో 1,38,377 మంది రైతుల ఎదురుచూపులు

# మాఫీ మోసం భరోసా బోగస్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే సబ్బండ వర్గాలకు అన్యాయం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆసరా, కల్యాణ లక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్స్ తదితర పథకాలను అమలు చేసి ఆపద్బాంధవుడిలా కేసీఆర్ పేరొందితే.. అధికారం చేపట్టిన ఏడాదికే అన్ని వర్గాల ప్రజలను కష్టాలపాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. మొదట రైతులను నమ్మించి మోసం చేసిన రేవంత్ ప్రభుత్వం తర్వాత ఒక్కో వర్గానికి తమ అసలు నైజం తెలిసేలా వ్యవహరిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో రాజులా బతికిన రైతులు నేడు పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయారు. పంట సాగు మొదలు పెట్టినప్పటి నుంచి పండించిన పంటను కొనేదాకా రైతులకు ఏ కష్టమూ రాకుండా కంటికి రెప్పలా కేసీఆర్ కాపాడుకుంటే... ఏడాదిలోనే రేవంత్‌రెడ్డి రైతులను అప్పులపాలు చేసి నట్టేట ముంచిందని జిల్లా రైతాంగం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు రూ.2 లక్షలలోపు రుణమాఫీ అయ్యిందంటూ ప్రచారం చేసుకుంటున్న లేనిపోని కొర్రీలు పెట్టి సగం మందికి అన్యాయం చేసిన రేవంత్ సర్కార్.. అర్హులుగా గుర్తించిన వారికి కూడా రుణమాఫీ చేయకపోవడం గమనార్హం.

- వికారాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ)



యాచారం మండలం మొండిగౌరెల్లిలో బీటలు వారిన పొలం

## కాంగ్రెస్ పాలనలో..
# మిగిలింది కన్నీరే..

- ఆందోళనలో అన్నదాతలు
- వేసవి ఆరంభంలోనే ఎండుతున్న వరి పంటలు
- అప్పులు చేసి పెట్టుబడులు

రంగారెడ్డి జిల్లాలో వేసవి ఆరంభంతోనే వరి పంటలు ఎక్కడికక్కడే ఎండిపోతున్నాయి. సరైన సాగు నీరు లేక, వేసిన పంటలకు నీరందక అనేక గ్రామాల్లో పొలాలు ఎండిపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతు భరోసా రానప్పటికీ రైతులు అప్పు చేసి మరీ పంటను సాగు చేశారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వర్షాభావ పరిస్థితులు అనుకూలించక భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. దీంత గతంలో ఐదెకరాలకు నీరందించే బోరు బావులు సైతం ఎండిపోయి గంటసేపు కూడా నీరుపోయని పరిస్థితి ఏర్పడింది. గతాన్ని నమ్ముకుని ఈసారి కూడా పంటలు సాగుచేసిన రైతులకు నిరాశే మిగులుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నప్పటికీ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని 21 మండలాల్లో యాసంగిలో 93 వేల ఎకరాల్లో వరి వేశారు. వరి నాట్లు వేసిన రెండు నెలలల్లోపే పంటలు ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- రంగారెడ్డి, మార్చి 4 (నమస్తే తెలంగాణ)



మొండిగౌరెల్లిలో అడుగంటిన బావి

### అర్హులైనా రాని రుణమాఫీ

కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన షరతులతో జిల్లా రైతాంగానికి అన్యాయం జరిగింది. పంట రుణమాఫీకి పెట్టిన షరతులతో కేవలం కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలోపు పంట రుణాల మాఫీతో 1.26 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరితే, కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన షరతులతో చాలా మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. పట్టాదారు పాసుపుస్తకాలను పరిగణనలోకి తీసుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతోనే సుమారు లక్ష మంది రైతులు నష్టపోయారు. జిల్లావ్యాప్తంగా 2.50 లక్షల మంది రైతులుండగా.. సుమారు 2 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకుంటే వీరిలో కేవలం 1.01 లక్షల మంది రైతులను మాత్రమే రూ.2 లక్షలలోపు రుణమాఫీకి అర్హులుగా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. ఒకేసారి రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని హామీనిచ్చి విడతల వారీగా రుణాలను మాఫీ చేపట్టింది. రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేశామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుంది కానీ వాస్తవానికి ఇంకా రూ.2 లక్షలలోపు రుణమాఫీ పూర్తికాలేదు. నాలుగో విడత రుణమాఫీకి సంబంధించి అర్హుల జాబితాను జిల్లా వ్యవసాయాధికారులు విడుదల చేసినప్పటికీ సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో మాత్రం ఇంకా డబ్బులు జమకాలేదు. జాబితాలో పేరు వచ్చిన రైతులు ఎప్పుడు తమ రుణాలు మాఫీ అవుతాయంటూ వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.50 లక్షల రుణాల లోపు ఉన్న రూ.750 కోట్ల రుణాలను మాఫీ చేయగా.. నాలుగో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల లోపు రుణాలున్న మరో 10,660 మంది రైతులకు సంబంధించిన రూ.98.17 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉన్నది.

### సగం మందికే రైతు భరోసా సాయం

సబ్బండ వర్గాల ప్రజలకు ఎన్నికలకు ముందు హామీలనిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ రైతులను నట్టేట ముంచింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు ప్రతి సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందించి అప్పుల్లో కూరుకుపోయిన రైతులను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసింది. అధికారంలోకి వస్తే రైతులకు రూ.16వేల పెట్టుబడి సాయం అందిస్తామని అబద్ధపు హామీనిచ్చి రూ.12 వేలకు తగ్గిస్తూ ఏడాదికి నిర్ణయం తీసుకున్న రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన మాటను కూడా నిలబెట్టుకోలేకపోయింది. ఒకేసారి రైతుల బ్యాంకు ఖాతాల్లో టింగ్ టింగ్‌మంటూ రైతు భరోసా సాయాన్ని జమ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది. విడతల వారీగా రైతు భరోసా సాయాన్ని జమ చేస్తున్న కాంగ్రెస్ సర్కార్.. మొదట మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, అందులోనూ తక్కువ జనాభా ఉన్న ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రైతు భరోసా సాయాన్ని అందజేసింది. తదనంతరం ఒక్క ఎకరం, రెండెకరాలు, తదనంతరం ఇప్పటివరకు మూడెకరాల వరకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని జమ చేసింది. జిల్లావ్యాప్తంగా అర్హులుగా గుర్తించిన రైతుల్లో కేవలం సగం మంది రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది. మిగతా రైతులు రైతు భరోసా సాయం కోసం వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తై వానకాలం సీజన్ కూడా పూర్తైనా ఇంకా రైతు భరోసా సాయం అందకపోవడంతో విత్తనాలు, ఎరువుల కోసం అప్పులు చేసిన జిల్లా రైతాంగం పెట్టుబడి సాయం ఎప్పుడొస్తుందోనని ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3,12,872 మంది రైతులు అర్హులుగా గుర్తించి వీరికి రూ.385.46 కోట్ల రైతు భరోసా సాయాన్ని అందజేసేందుకు నిర్ణయించగా.. ఇప్పటివరకు మూడెకరాలలోపుగల 1,74,495 మంది రైతులకు రూ.143.13 కోట్ల రైతు భరోసా సాయాన్ని మాత్రమే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మిగతా రైతులకు రైతు భరోసా సాయం ఎప్పుడు జమ అవుతుందనేది అధికారులకు కూడా స్పష్టత లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గుంట భూమి మొదలుకొని అర్హులైన వారందరికీ ఎకరాకు ప్రతి సీజన్‌కు ముందే రూ.10 వేల చొప్పున రైతు బంధు సాయాన్ని అందజేసింది. జిల్లావ్యాప్తంగా 12.35 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూములున్నాయి. వీటిలో అర్హులైన వారిని గుర్తించి ప్రతి సీజన్‌కు 6 లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు రూ.300 కోట్లపైగా రైతు బంధు సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కింద రూ.2926 కోట్ల సాయాన్ని రైతులకు పెట్టుబడి నిమిత్తం అందజేసింది.

### అర్హత ఉన్నా రుణమాఫీ కాలే..



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటిపోయినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదు. కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయింది. చాలా వరకు లక్ష వరకు రుణమున్న రైతులకు కూడా ఇంతవరకు రాలేదు. బ్యాంకులో వెళ్లి అడిగితే మాకు తెల్వదంటున్నారు. అధికారులను అడిగితే మేం పంపించామని.. ప్రభుత్వం నుంచి రావాలని అంటున్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రూ.2లక్షల వరకు రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమ చేయాలి.

**- రాములు, రైతు, ఆలేడ్, దుద్యాల మండలం, కొడంగల్**

### అప్పులు చేయాల్సి వస్తున్నది



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు 2 లక్షల రుణ మాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి. బొంరాస్‌పేట్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ శాఖలో నాకు 2 లక్షల రూపాయల వ్యవసాయ రుణం ఉన్నది. కానీ నాకు ఇప్పటివరకు ఎలాంటి రుణమాఫీ డబ్బులు రాలేదు. బ్యాంకులో తీసుకున్న రుణం మాఫీ కాకపోవడంతో మళ్లీ నాకు రుణం ఇవ్వడంలేదు. దీంతో పంట పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తున్నది.

**- మల్లయ్య, రైతు, తుంకిమెట్ల**

### పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి



కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన మాట ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా రైతులకు పూర్తి స్థాయిలో పంట రుణాలను అందజేయలేదు. అందరికీ రుణ మాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా నాకు మాత్రం రుణమాఫీ అందలేదు. దీంతో వ్యవసాయ పెట్టుబడులకు ఇబ్బందులు వస్తున్నాయి.

**- రవిగౌడ్, రైతు, మెట్లకుంట**

### రూ.50వేల రుణమాఫీ కూడా కాలే..



వికారాబాద్‌లోని కెనరా బ్యాంక్‌లో రూ.50వేలు రుణం తీసుకున్నా. ఇప్పటివరకు బ్యాంక్ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. బ్యాంక్‌కు, వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లి అడగగా, వస్తాయంటూ మాట దాటవేస్తున్నారు. మా ఊరి రైతుల ఖాతాలు ఈ బ్యాంకులో చాలా ఉన్నాయి. కొద్దిమంది రైతులకు మాత్రమే రుణ మాఫీ జరిగింది. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యమో, ప్రభుత్వ వైఫల్యమో అర్థం కావడంలేదు.

**- వెంకటయ్య, కొంపల్లి, వికారాబాద్**

### రుణ మాఫీ అయితదో కాదో తెలువదు



నాకు 24 గుంటల భూమి ఉన్నది. వికారాబాద్ కెనరా బ్యాంక్‌లో రూ.34 వేల రుణం తీసుకున్నాను. వెంటవెంటనే రెన్యువల్ కూడా చేశాను. బ్యాంకు, వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్తే తరువాత వస్తుందని చెబుతున్నారు. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా రుణ మాఫీ కాలేదు.

**- సంద నర్సింహులు, కొంపల్లి, వికారాబాద్**

### మాట నిలబెట్టుకోవాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలేవీ సక్రమంగా అమలు చేయడంలేదు. మర్పల్లి కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.2.03 లక్షల రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఇప్పటివరకు చెయ్యలేదు. సర్కారు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. చేతగాని హామీలిచ్చి మభ్యపెట్టారు.

**- నీలి శంకరయ్య, మర్పల్లి**

### భరోసా లేని రైతు భరోసా



భరోసా లేని రైతు భరోసా పేరు చెప్పి రైతు బంధు బందు చేసేలా ఉన్నాడు. రేవంత్ సర్కార్‌కు చేతకాక రైతులను నిండా ముంచుతున్నది. ఎద్దు ఏడ్చిన ఎవుసము, రైతు ఏడ్చిన రాజ్యం ఎప్పుడూ బాగుపడదు.

**- జుట్టు వెంకటయ్య, నాగులపల్లి, పెద్దేముల్ మండలం**

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- వికారాబాద్ జిల్లాలో 29 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న విద్యార్థులు : ఇంటర్ ఫస్టియర్‌లో 7914, సెకండ్ ఇయర్‌లో 6963..
- రంగారెడ్డి జిల్లాలో 185 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న విద్యార్థులు : ఇంటర్ ఫస్టియర్‌లో 80,490, సెకండ్ ఇయర్‌లో 78,395
- పరీక్షా కేంద్రానికి ఉదయం 8.45 లోపు విద్యార్థులు చేరుకునేలా చూడాలని తల్లిదండ్రులకు సూచన



ఆమనగల్లులోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఎస్ మాధవరావు

రంగారెడ్డి/వికారాబాద్ మార్చి 4 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇంటర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 5 నుంచి 25 వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రంగారెడ్డి జిల్లాలో 185, వికారాబాద్ జిల్లాలో 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 80,490., సెకండ్ ఇయర్‌లో 78,395., వికారాబాద్ జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 7914., సెకండ్ ఇయర్‌లో 6963 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సంబంధీకులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగు నీటి సౌకర్యంతోపాటు మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోనున్నారు. పరీక్షల నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులకు ఉన్నతాధికారులు సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులు ఉదయం 8.45 లోపు పరీక్ష కేంద్రానికి చేరుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. 9.05 నిమిషాల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించే అవకాశం బోర్డు కల్పించింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.